కథానిక

డా॥ మిరియాల రామకృష్ణ

# సుందరం శైలి

పోటీలకు కథలు రాయడం సుందరానికిష్టంలేదు. ఎందుకిష్టం లేదని ఎవరైనా అడిగితే చిరునవ్వు నవ్వుతూ ''నాకు లాటరీ టిక్కట్లు కలిసిరాలేదు. ఎం.ఏ.లో ఫస్టుక్లాసు రాలేదు. దావాలో గెలుచుకోలేదు.'' అంటూ కేటలాగు నంతటినీ చదివి "అందుకే పోటీలో పాల్గొనదల్చుకోలేదు" అంటాడు.

ఈ సమాధానం సుధాకర్‌కు ఎంత మాత్రం నచ్చలేదు. కాఫీ హోటల్ లో రవ్వదోసె తింటూన్న సుందరానికెదురుగా కూచుని జీడిపప్పు పకోడి నములుతున్న సుధాకర్ "సుందరంగారూ! ఇవాళ పదో తారీఖు. పదహారో తారీఖులోగా అందేలా ఒక మంచి కథ రాయండి. పోటీకి నాపేరు పెట్టి పంపిస్తాను. నెగ్గితే పేరు నాది; సొమ్ము మీది" అన్నాడు.

ఒక సుప్రసిద్ధ వారపత్రిక కథల పోటీ నిర్వహిస్తోంది. ఈ సంగతి సుందరంకు తెలిసినా నిర్లిప్తంగా ఉండిపోయాడు. సుధాకర్ మాత్రం ఆశపడ్డాడు. నాలుగంకెలమీద వచ్చే బహుమానమాయె! సుందరం రాయడమూ రాకపోవడమూనా?

''నేను కథ రాయను; నీకు కావాలంటే 'డిక్టేటు' చేస్తాను. సరేనా? రాసుకుందువుగాని; ముందు మనం ఒక చక్కని లాడ్జికి పోదాంపద, ఒక రోజు ప్రశాంతంగా కాలక్షేపం చేశాక, కథను నేను చెబుతాను; నువు రాద్దువుగాని. దస్తూరీ ఎవరిదైతే కథ వాళ్ళదే" అన్నాడు సుందరం వేళాకోళంగా.

"ఇద్దరూ టీ తాగి, రోడ్డున పడ్డారు అందులో ఒకాయన మంచి కథా రచయిత. రెండో ఆయన నాటకాల్లో వేషాలు వేస్తాడు" అని వాళ్ళను గురించి ఇద్దరు టీచర్లు చెప్పుకుంటూ పోతున్నారు.

కార్లు, లారీలు నిశ్శబ్దాన్ని రోడ్డుమీద బరబరా ఈడ్చేస్తూ పరుగెడుతున్నాయి. హాస్పిటల్ గేటు దగ్గర రిక్షాలు మూలుగుతూ నడుస్తున్నాయి. ఇవన్నీ దాటుకుని, సుందరం, సుధాకరం మనోరథా లాడ్జి దగ్గర కెళ్ళారు. లాడ్జి మనోరథా దీపతోరణాలతో మిలమిలలాడిపోతోంది. సుధాకర్ లాడ్జిలో రూమ్ కావాలంటే మేనేజరు చిరునవ్వుతో ఆహ్వానించాడు.

"సార్! లిఫ్టు రెడీగా ఉంది. మీ రూము నాలుగో అంతస్తులో ఉంది. టి.వి. ఏర్పాటు, ఫోను కూడా ఉన్నాయండీ" అన్నాడు.

మరుక్షణానికే సుందరం, సుధాకరం నాలుగో అంతస్తులో 506 వ రూము లోకి చేరారు. సర్వర్‌తో చెప్పి తెల్లకాగి తాలూ, బాలుపెన్నూ తెప్పించుకున్నారు.

సుందరం ఇంటికి ఫోను చేశాడు సుధాకర్ కూడా ఫోనులో మెస్సేజి అంద జేశాడు. ఈ రాత్రికి ఇక్కడే మకాం.

"ఈ వాతావరణం చూస్తూంటే కథన కుతూహలం ఆగడంలేదు. సుధాకరుడా! రాస్తావా? కథ పేరు 'వెన్నెల' ఇక రాసుకో!" అన్నాడు సుందరం.

రమారమి గంటసేపు అనర్గళంగా చెప్పాడు సుందరం. సుధాకర్ కథను జాగ్రత్తగా రాశాడు. పది పేజీలు దాకా వచ్చింది కథ.

"తెల్లారితే పదకొండో తేదీ! రేపే పోస్టు చేస్తాను. ఏమంటారు?" అని అడిగాడు సుధాకర్. "ఈ కథకు ఫోటో స్టాట్ తీయించి ఉంచరాదూ?" అన్నాడు సుందరం. "తిరిగొస్తే మంచిదే పోస్టు వాళ్ళదయ కూడా ఉండాలోయ్" అన్నాడు సుందరం.

మర్నాడు ఉదయం లాడ్జి ఖాళీచేసి ఎవరిదారిని వాళ్ళు వెళ్ళిపోయారు. కథను పోస్టుచేయాల్సిన సుధాకర్ పోస్టాఫీసుకు వెళ్ళి "ఎన్ని స్టాంపులంటించాలో తూచి చెబుతారా?" అని రిజిస్ట్రేషన్ కౌంటర్‌లో చూపించాడు. 'రూపాయి!' అని ఠక్కున చెప్పాడు పోస్టు మాస్టరు. 'బుక్‌పోస్టు కాదండి' అన్నాడు సుధాకర్ కవర్ అంటించేస్తే రూపాయి సలభై స్టాంపులతికించండి' అన్నాడు మాస్టరు. "ఏమండీ ఇది 16 లోగా విజయవాడ చేరుతుందా?" అని ప్రశ్నించుదామనుకుని, నాలుక కర్చుకుని, ఊరుకున్నాడు సుధాకర్.

కథను పోస్టుడబ్బాలో పడేశాడు సుధాకర్. "పోటీ ఫలితాలు వచ్చే ముందు తనకు బహుమతివస్తే, వాళ్ళే టెలిగ్రామిస్తారులే" అనుకుంటూ సాగిపోయాడు సుధాకర్.

13వ తేదీ ఉదయం పోస్టుమాన్ సుధాకర్ ఇంటికి వచ్చాడు, "సార్! మీకు వారపత్రిక నుంచి కవరు వచ్చిందండి. ఒక రూపాయి డ్యూ కట్టాలండి! బిళ్ళలు తక్కువగా అంటించారుట" అంటూ తెల్లని వెన్నెల లాంటి కవరును చేతికందివ్వబోయాడు. సుధాకర్ మొహం తెల్లబోయింది. రూపాయి నోటిచ్చి కవరు తీసుకున్నాడు. ఏముంది? తను పంపిన కవరే తనకు తిరిగొచ్చింది. ఇలా ఎందుకు జరిగింది? రిజిస్ట్రేషన్ కౌంటర్‌లో ఉన్న గుమాస్తా

రూపాయి నలభయ్యే కదా అంటించ మన్నాడు!'' అనుకుంటూ బాధపడ్డాడు.

"గడువు తేదీ16 కదా!మళ్ళీ దీన్ని పంపించడానికి టైము సరిపోతుందిలే!" అంటూ కొత్త కవరులో ఆ కవరులోని స్క్రిప్టును పెట్టి బుక్‌పోస్టు, ప్రెస్సు కేమాటర్ అని రాసి వలం 60 పైసలం టించి పోస్టులో పడేశాడు. ఈ మాటు అది తిరిగి రాలేదు. కానీ ఒకనోట్ వచ్చింది కార్డుమీద. "అయ్యా సుందరం గారి శైలినెక్కడ సంపాదించారు! ఈ కథను తిరస్కరిస్తున్నాం" అంటూ ఎడిటర్ సంతకంచేసి పంపిన కార్డును చూసి, సుధాకర్ బిక్క చచ్చిపో యాడు. **

---

# అంతరంగ తరంగం

గుండె అడుగున
గూళ్ళు కట్టుకున్న
భావాల సమూహాలు
అప్పుడప్పుడు బద్దలై
సద్దు మణిగిన
చరిత్ర పుటల్లో
అక్షరాలుగ
చిరస్థాయిగ నిలుస్తై!
నిన్నటి చీకటి పొదల్ని
కూకటి వేళ్ళతో తొలగిస్తై!

ఆత్మ స్థైర్యంతో
ఆలోచనా తంత్రుల్ని మీటి
నేటి ప్రాపంచిక
విపంచి!ని సరిదిద్దుతై!
అణగారిన జనానికి
క్రొత్త ఊపిరి పోసేందుకు
విచ్చుకత్తులై
విపణి వీధిలో
విలయ తాండవం చేస్తై!

చప్పుడు కాకుండా
రేపటి కోసందాచిన
అక్రమ సంపద మూటల్ని
నడిబజారులో విప్పుతై!
గుమ్మానికి
రంగులు పూసి
గాయాన్ని
మాయం చేసినంత మాత్రాన
రక్తం స్రవించక పోదు
గుట్టు రట్టు కాక మానదు!

— చొక్కర తాతారావు